
సాక్షి
కుమురం భీం
బుధవారం ❙ 4 ❙ జూన్ ❙ 2025



కోతులతో పరేషాన్! 9లో▸

అటవీ ప్రాంతాల్లో ఉండాల్సిన కోతులు గ్రామాల బాట పడుతున్నాయి. గుంపులుగా సంచరిస్తూ ఇళ్లలోకి చొరబడుతున్నాయి. ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి.



సమస్యల పరిష్కారానికే భూభారతి

భూసంబంధిత సమస్యల పరిష్కారానికే భూభారతి చట్టాన్ని రూపొందించినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి అర్జీలు స్వీకరించారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0 /26.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

రైతులకు విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: 'నాణ్యమైన విత్తనం–రైతన్నకు నేస్తం'లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతువేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు వరి, కంది, పెసర విత్తనాలను డీఏవో శ్రీనివాస్‌రావ్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శివకృష్ణ పంపిణీ చేశారు. వ్యవసాయశాఖ కార్యక్రమంలో అధికారులు మంజుల, విజయ్, దీప్తి, ఏఈవోలు రాము, చిరంజీవి, రహమాన్, స్వాతి, దమ్మదాస్ తదితరులున్నారు.

చెక్కు అందజేత



చెక్కు ఇస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావ్

ఆసిఫాబాద్‌అర్బన్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ రాథోడ్ గణేశ్ కుటుంబానికి కోఆపరేటివ్ సొసైటీ ద్వారా మంజూరైన రూ.1.65లక్షల చెక్కును జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావ్ మంగళవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పోలీసు కుటుంబాలకు ఎల్లప్పుడు పోలీస్‌శాఖ అండగా నిలుస్తుందని చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన ఇతర ప్రయోజనాలు త్వరగా అందేలా చూస్తామన్నారు. పోలీస్‌శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు పోలీస్ కోఆపరేటివ్ సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. ఆర్‌ఐ అడ్మిన్ పెద్దయ్య, జిల్లా పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ కోఆర్డినేటర్ జాఫరొద్దీన్, ఆర్‌ఐ ఎంటీ అంజన్న ఉన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డీపీవో భిక్షపతి

పెంచికల్‌పేట్: సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి సూచించారు. మంగళవారం పెంచికల్‌పేట్ జెడ్పీఎస్‌ఎస్ ఆవరణలో ఎంపీడీవో అధ్యక్షతన సీజనల్ వ్యాధుల నివారణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, సీజనల్ వ్యాధుల నివారణ తదితర అంశాలపై చర్చించారు. ఓవర్ హెడ్ ట్యాంకుల శుభ్రత, బ్లీచింగ్ పౌడర్ వాడకం, నీటి లీకేజీల నివారణకు మార్గదర్శకాలు జారీ చేశారు. డ్రెయినేజీల్లో పూడికతీత, దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో 'డ్రై డే' పాటించాలని, బడిబాటను విజయవంతం చేయాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్, తహసీల్దార్ పుష్పలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అర్షిన్ పాల్గొన్నారు.

ముంపు రైతులకు న్యాయం జరిగేలా చూడాలని వినతి



కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో నూతనంగా చేపట్టనున్న గోలేటి ఓసీపీలో ముంపునకు గురయ్యే భూముల రైతులకు న్యాయం జరిగేలా చూడాలని సోనాపూర్ గ్రామస్తులు బుధవారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రాలు ఇచ్చారు. ఎకరాకు రూ.60లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సింగరేణి యాజమాన్యం పరిహారం చెల్లింపుల విషయంలో అన్యాయం చేయాలని చూస్తోందని ఆరోపించారు. ముంపునకు గురయ్యే భూముల మార్కెట్ విలువ రూ.60లక్షలు ఉండగా, రిజిస్ట్రేషన్ విలువ రూ.2.25లక్షలుగా చూపిస్తూ రూ.7.5 లక్షలు చెల్లించి లాక్కునేందుకు ప్రయత్నిస్తోందని వాపోయారు. తమ డిమాండ్లను అంగీకరించకుంటే సింగరేణికి భూములు ఇవ్వమని చెప్పారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్, గ్రామపటేల్ దొందే రావు, సిడాం తిరుపతి, మధూకర్‌గౌడ్, రైతులు భగవంత్‌రావు, సదయ్య, అనంతరావు, నవీన్, లక్ష్మణ్, భుజంగరావు, తిరుపతి, సాగర్, శంకర్, రమేశ్, శ్రీనివాస్ ఉన్నారు.

కారిడార్ ఇక కన్జర్వేషన్!

- ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్లలో చర్యలు
- పులుల సంరక్షణ ప్రాంతంగా మార్పు
- భవిష్యత్‌లో కొత్త టైగర్‌జోన్‌కు అవకాశం
- పులుల పేరుతో ఆంక్షలపై స్థానికుల వ్యతిరేకత



కాగజ్‌నగర్ డివిజన్‌లో సంచరిస్తున్న పులి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే పులులకు ప్రధాన కారిడార్‌గా ఉన్న ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్లు 'టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్'గా మారనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాంతం కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలోనే పులుల రాకపోకలకు కీలకంగా ఉంది. దీంతో పులుల సంరక్షణకు వీలు కలగనుంది. ఉమ్మడి జిల్లా పరిధి ఆసిఫాబాద్‌లో అధికంగా పులుల సంచారం పెరుగుతోంది. అయితే వీటి సంరక్షణ చర్యలు చేపట్టినా, పరిమిత అధికారులు మాత్రమే ఉండేది. తాజాగా టైగర్ రిజర్వ్‌గా ఏర్పాటు చేయడంతో పులుల సంరక్షణకు మరిన్ని ప్రత్యేక కార్యకలాపాలు చేయాల్సి ఉంది. ఏదైనా ప్రాంతాన్ని కేంద్ర ప్రభుత్వం టైగర్ రిజర్వ్‌గా గుర్తించాలంటే ముందుగా వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాలు, కన్జర్వేషన్ రిజర్వ్‌గా కొనసాగుతున్న వాటికే అనుమతి ఇస్తుంది. భవిష్యత్‌లో కేంద్రం నుంచి కొత్తగా టైగర్ రిజర్వ్‌గా ఏర్పాటుకు అవకాశం కలగనుంది.

నివాసాలు

కాగజ్‌నగర్ డివిజన్ నుంచి బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల, జన్నారం వరకు పులుల సంచారం ఉంటోంది. మొదట అధికారులు జన్నారం కోర్ ప్రాంతంగా టైగర్ రిజర్వ్ ఏర్పాటు చేశారు. అక్కడి పరిస్థితులు పులుల ఆవాసానికి అనుకూలంగా లేకపోవడంతో చుట్టపు చూపులా వచ్చి వెళ్తూ.. నివాసం ఏర్పాటు చేసుకోవడం లేదు. మరోవైపు ప్రాణహిత, పెద్దవాగు, గోదావరి తీరాల్లో కాగజ్‌నగర్ నుంచి చెన్నూరు, బెల్లంపల్లి డివిజన్ల వరకు పులుల సంచారం పెరుగుతోంది. ముఖ్యంగా కాగజ్‌నగర్ డివిజన్‌లో కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్, బెజ్జూరు, దహెగాం, పరిధిలో పులుల నివాసాలు ఉన్నాయి. ఇక వేమనపల్లి, చెన్నూరు, కోటపల్లి పరిసరాల్లోనూ వాటి సంచారం ఉంది. కోర్ ప్రాంతంగా ఉన్న కవ్వాల్ వరకు వెళ్లకపోగా ఇక్కడే స్థిర నివాసం ఎక్కువగా ఏర్పర్చుకుంటున్నాయి. పాల్గుణ అనే ఆడపులి సంతతితోపాటు కే, ఎస్, పీ, ఏ సిరీస్ పేర్లతో ఉన్న పులులన్నీ ఇక్కడి పరిధిలోనివే. పులులు జతకట్టి సంతానాన్ని వృద్ధి చేసుకుంటున్నాయి. కాగా, వేట, మానవ కార్యకలాపాలతో జాతీయ జంతువులకు ముప్పు పొంచి ఉంది.

స్థానికుల వ్యతిరేకత

ఉమ్మడి జిల్లా పరిధిలో కవ్వాల్ కోర్ గ్రామాలతోపాటు సంచారం అధికంగా ఉన్న కారిడార్ ప్రాంతాల్లోనూ ఆంక్షలు విధిస్తున్నారు. దీంతో అటవీ సమీప గ్రామాలతోపాటు గిరిజన, ఆదివాసీల నుంచి వ్యతిరేకత వస్తోంది. ఇప్పటికే కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించినప్పటికీ నిరసనలు ప్రారంభమయ్యాయి. పోడు రైతులతోపాటు రెవెన్యూ పరిధిలో ఉన్న చోట్ల కూడా పులుల సంచారంతో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయంతోపాటు తమ రోజువారీ కార్యకలాపాలకు అడ్డుగా నిలుస్తుందనే కన్జర్వేషన్ ఉత్తర్వులు ఎత్తివేయాలని డిమాండ్లు చేస్తున్నారు. కన్జర్వేషన్‌గా మార్పుపై కవ్వాల్ ఫీల్డ్ డైరెక్టర్(ప్రాజెక్టు టైగర్) శాంతారామ్‌ను సంప్రదించగా, స్థానికంగా తమకు ఇంకా ఎలాంటి ఉత్తర్వులు రాలేదని తెలిపారు. పులుల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

రక్షణకు పకడ్బందీ చర్యలు

ఉమ్మడి జిల్లాలో విస్తరించిన కవ్వాల్ అభయారణ్యంలో బఫర్ ఏరియాలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఉంది. 1.40లక్షల హెక్టార్ల అటవీ విస్తీర్ణంతో ఉన్న రెండు డివిజన్లలో ఈ టైగర్ కన్జర్వేషన్‌గా మార్చడంతో మరిన్ని ఆంక్షలు అమల్లోకి రానున్నాయి. పులులు సంచరించే ప్రాంతాల్లో మానవ కార్యకలాపాలు పూర్తిగా తగ్గించడంతోపాటు పలు నిషేధిత ఆజ్ఞలు అమలులో ఉండనున్నాయి. వన్యప్రాణుల సంరక్షణ ఉల్లంఘనలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. వేటాడడం, విద్యుత్ కంచెలు అమర్చడం, వన్యప్రాణులకు హాని తలపెట్టే వీలు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకునేందుకు వీలవుతుంది.

విత్తన ఎంపికే కీలకం

- అధికారుల సూచనలు పాటించాలి
- విత్తనాలు అధిక ధరకు అమ్మొద్దు
- 'నకిలీ'వి విక్రయిస్తే కఠినచర్యలు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఏడీఏ మిలింద్



మిలింద్, ఏడీఏ

ఆసిఫాబాద్‌రూరల్: పంటల సాగులో విత్తనాల ఎంపికే కీలకమని ఏడీఏ మిలింద్ సూచించారు. సరైన విత్తనాలు ఎంచుకుని సమగ్ర విధానాలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని పేర్కొన్నారు. రైతులు చిన్న వానలకే తొందరపడి పత్తి విత్తనాలు వేయొద్దని తెలిపారు. సరైన వర్షపాతం నమోదయ్యాకే విత్తనాలు వేసుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందే అవకాశముంటుందని వివరించారు. ఆయన మంగళవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వానాకాలం సాగుకు సంబంధించి మరిన్ని వివరాలు వెల్లడించారు.

సాక్షి: జిల్లాలో ఈ ఖరీఫ్‌లో ఏయే పంటలు.. ఎంత విస్తీర్ణంలో సాగవుతున్నాయి?

ఏడీఏ: జిల్లాలో 4,45,049 ఎకరాల సాగుభూమి ఉంది. 1.48 లక్షల మంది రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో పత్తి 3,35,363 ఎకరాలు, వరి 56,861 ఎకరాలు, కంది 30,430 ఎకరాలు, పెసర, మినుములు, జొన్న, కూరగాయలు తదితర పంటలు 22,395 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

సాక్షి: విత్తనాల ఎంపిక విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు మీరిచ్చే సూచనలు?

ఏడీఏ: రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి. పంటకాలం పూర్తయ్యేదాకా దానిని భద్రంగా దాచి ఉంచాలి. గ్రామంలోనే తక్కువ డబ్బులకు లూజ్ విత్తనాలు వస్తున్నాయని ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయొద్దు. లూజ్ విత్తనాలు ఎవరైనా అమ్మితే వెంటనే మాకు సమాచారం ఇవ్వాలి.

సాక్షి: జిల్లాలోని కొన్ని దుకాణాల్లో పత్తి విత్తనాలు, యూరియా, ఇతర ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి?

ఏడీఏ: ప్రభుత్వం పత్తి ప్యాకెట్ ధర రూ.901 గా నిర్ణయించింది. ఎవరైనా ఇంతకంటే ఎక్కువ ధరకు అమ్మితే మా దృష్టికి తీసుకువస్తే కఠినచర్యలు తీసుకుంటాం. యూరియాను రూ.266 విక్రయించాలి. కానీ.. కేంద్ర ప్రభుత్వం ట్రాన్స్‌పోర్టు ఖర్చులు ఇవ్వడం లేదు. దీంతో ట్రాన్స్‌పోర్టు చార్జీ కింద అదనంగా రూ.20 వరకు మాత్రమే తీసుకోవాలి. ఎవరైనా ఇంతకంటే కంటే ఎక్కువ తీసుకుంటే ఫిర్యాదు చేయాలి.

సాక్షి: ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు మీరిచ్చే సలహాలు ఏమిటి?

ఏడీఏ: రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. ఎకరా పత్తి పంటకు రెండు యూరియా, ఒక డీఏపీ, ఒక పొటాష్ బస్తాలు సరిపోతాయి. పంటకాలంలో నాలుగుసార్లు వేసుకోవాలి. ఇంతకంటే ఎక్కువ మోతాదులో వాడితే పెట్టుబడి ఖర్చు పెరగడమే గాని అదనపు ప్రయోజనం ఉండదు. సేంద్రియ ఎరువులు వినియోగిస్తే, పంట మార్పిడి విధానం పాటిస్తే భూసారం పెరిగి అధిక దిగుబడి వస్తుంది.

సాక్షి: వరి నార్లు ఎప్పుడు పోసుకోవాలి?

ఏడీఏ: నీటి వసతి ఉన్నవారు వరి నారు పోసుకోవచ్చు. ఆసిఫాబాద్ మండలంలో ప్రతీసారి వరిని ఆలస్యంగా సాగు చేస్తున్నారు. జూన్ చివరి వారం లేదా జూలై మొదటి వారంలో వరి నాట్లు పూర్తయ్యేలా చూసుకోవాలి. సాగుకు ముందు పచ్చిరొట్ట విత్తనాలు వేసి పూత దశలో కలియ దున్ని వరి నాటు వేసుకుంటే భూమిలో సారం పెరుగుతుంది. పంటల దిగుబడి కూడా అధికంగా వస్తుంది.

ఏనుగులు మహారాష్ట్రలోనే..

- ప్రస్తుతానికి ఎలాంటి ఇబ్బంది లేదు
- నిరంతరం అప్రమత్తంగా అటవీశాఖ
- సరిహద్దు మండలాల ప్రజలకు ఊరట

చింతలమానెపల్లి: తెలంగాణ సరిహద్దు వరకు ఏనుగులు వస్తున్నాయనే హెచ్చరికల నేపథ్యంలో కొంత ఊరట లభించింది. తాజా సమాచారం మేరకు ఏనుగులు మహారాష్ట్రలోని మూల్ తాలూకాలోని సింధెవాయి అటవీ ప్రాంతంలో ఉన్నట్లు తెలుస్తోంది. మంగళవారం జిల్లా అటవీ అధికారి నీరజ్ టిబ్రెవాల్, కాగజ్‌నగర్ అటవీ డివిజన్ అధికారి సుశాంత్ బొగాడె అధికారులను అప్రమత్తం చేశారు. మహారాష్ట్ర అటవీ అధికారుల ద్వారా సమాచారం తెలుసుకున్నారు. గడ్చిరోలి జిల్లా కేంద్రంలో కొద్దిరోజులుగా సంచరించిన ఏనుగులు చాముర్షి అటవీ ప్రాంతం నుంచి వెళ్లి ఆష్టి, గోండ్‌పిప్రి సమీపంలోని పంబూర్నా అటవీ ప్రాంతంలో సంచరించాయి. వాటి కదలికలు తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన సిర్పూర్(టి), కౌటాల మండలాల వైపు ఉండగా అధికారులు సిర్పూర్ నుంచి కౌటాల, చింతలమానెపల్లి మండలాల ప్రజలను అప్రమత్తం చేశారు. తాజాగా ఏనుగులు మహారాష్ట్ర ఎగువ ప్రాంతం వైపు వెళ్తున్నాయనే సమాచారం మహారాష్ట్ర అటవీ అధికారులు తెలిపారు. సిర్పూర్(టి) రేంజ్ అధికారి, ఖర్జెల్లి ఇన్‌చార్జి రేంజ్ అధికారి ఇక్బాల్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఏనుగుల సమాచారం కోసం మహారాష్ట్ర అధికారులతో సంప్రదిస్తున్నట్లు పేర్కొన్నారు. మహారాష్ట్ర అటవీశాఖకు చెందిన ఒక టీం ఏనుగును నిరంతరం గమనిస్తున్నట్లు తెలిపారు. అటవీశాఖ అప్రమత్తంగా ఉందని, ఏనుగులు సరిహద్దు దాటి తెలంగాణలోకి వస్తే ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సరిహద్దు గ్రామాల్లో అవగాహన కల్పించామని, ఏనుగు కదలికలపై ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నామని తెలిపారు.

టైగర్‌జోన్ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి



దీక్షాశిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ఆదివాసీల భూములను లాక్కునే ప్రయత్నంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తెరమీదకు తీసుకువస్తున్న కాగజ్‌నగర్ టైగర్ జోన్ ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఆదిమ గిరిజన భూరక్షణ పోరాట కమిటీ, రాజ్‌గోండ్ సేవా సమితి, గోండ్వాన పంచాయతీ రాయి సెంటర్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష ఆరోరోజుకు చేరింది. దీక్ష శిబిరాన్ని మంగళవారం ఎమ్మెల్యే సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టైగర్‌జోన్ పేరుతో ప్రభుత్వం భూములను తిరిగి తీసుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. టైగర్ జోన్ ఏర్పడితే ఆదివాసీల జీవితాలు ఛిద్రమవుతాయని తెలిపారు. పోడు సాగు చేస్తున్న రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వల అటవీశాఖ అధికారులతో అక్రమ కేసులు పెట్టిస్తోందని విమర్శించారు. ఆదివాసీ గ్రామాలకు రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అధికారులు అనుమతులివ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలకు తాను అండగా ఉంటానని, ఇప్పటికైనా అధికారులు గిరిజనుల హక్కులకు అడ్డుకునే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కుమురంభీం పోరాట స్ఫూర్తితో ఆదివాసీలు ఐక్యంగా దీనిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ సంఘం నాయకులు సిడాం అర్జు, బుర్స పోచయ్య, మడావి శ్రీనివాస్, పెందూర్ సుధాకర్, బీఆర్‌ఎస్ నాయకుడు రవీందర్ పాల్గొన్నారు.

పకడ్బందీగా కొనుగోళ్లు చేపట్టాలి



సాండ్‌గాంలో రైతులతో మాట్లాడుతున్న శ్రద్ధ శుక్లా

కౌటాల: వరి ధాన్యాన్ని పకడ్బందీగా కొనుగోలు చేయాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా సూచించారు. మండలంలోని సాండ్‌గాం గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం వెంటవెంటనే కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జాప్యం చేయకుండా రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ ప్రమోద్, నిర్వాహకులున్నారు.

యోగా శిక్షణ కేంద్రం ప్రారంభం

కౌటాల మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో జన భవిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత యోగా, ధ్యాన శిక్షణ కేంద్రాన్ని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా ప్రారంభించారు. కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఐ రమేశ్, ఎంపీడీవో రమేశ్, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, ట్రస్ట్ చైర్మన్ వరలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు సురేశ్, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు కుంచాల విజయ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దుర్గం మోతీరాం, పతంజలి జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, యోగా శిక్షకుడు వినోద్‌గౌడ్, నాయకులు నాందేవ్, భూమయ్య, అశోక్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పేదోళ్లకు 'బెస్ట్' స్కూళ్లు

- జిల్లాలో రెండు పాఠశాలల ఎంపిక
- నిరుపేద ఎస్సీ విద్యార్థులకు వరం
- ఈ నెల 16వరకు దరఖాస్తు గడువు
- లక్కీ డ్రా పద్ధతిలో సీట్ల కేటాయింపు



బెస్ట్ అవైలబుల్ పథకానికి ఎంపికైన కౌటాల మయూరి విద్యాలయం

కౌటాల: నిరుపేద ఎస్సీ విద్యార్థులకు జిల్లాలో ఎంపిక చేసిన ప్రైవేట్ పాఠశాలల్లో రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ సౌకర్యాలతో మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఉచిత విద్యతోపాటు వసతులు కల్పిస్తోంది. జిల్లాకు రెండు బెస్ట్ అవైలబుల్ పాఠశాలలు ఇవ్వడంతో ఇవి జిల్లాలోని నిరుపేద ఎస్సీ విద్యార్థులకు వరంగా మారుతున్నాయి. ఈ పాఠశాలల్లో ప్రవేశాల కోసం అధికారులు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

కలెక్టరేట్‌లో లక్కీ డ్రా ద్వారా..

జిల్లా కేంద్రంలోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు ఫారం తీసుకోవాలి. అన్ని ధ్రువీకరణ పత్రాలు జతచేసి ఈ నెల 16లోపు జిల్లా ఎస్సీ కార్యాలయంలో అందజేయాలి. ప్రవేశాల కోసం ఈ నెల 20వ తేదీన కలెక్టరేట్ కార్యాలయంలో లక్కీ డ్రా పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశం కల్పిస్తారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు. పూర్తి వివరాల కోసం జిల్లా ఎస్సీ కార్యాలయం లేదా బెస్ట్ అవైలబుల్ పథకం కింద ఎన్నికైన ఆయా పాఠశాలలను సంప్రదించాలని సూచించారు.

ప్రవేశాల కోసం అర్హతలివే..

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశానికి కుటుంబంలో ఒక్కరికే అవకాశం ఉంటుంది. జిల్లాకు చెందిన విద్యార్థులే దరఖాస్తు చేసుకోవాలి. ఒకటో తరగతిలో ప్రవేశం పొందేవారు 01.06.2019 నుంచి 31.05.2020 మధ్య జన్మించి ఉండాలి. 01.06.2025 నాటికి 5–6 ఏళ్లలోపు ఉండాలి. 2024–25 విద్యా సంవత్సరంలో నాలుగోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐదో తరగతిలో ప్రవేశానికి అర్హులు. ఆదాయ ధ్రువీకరణ పత్రం (గ్రామీణ ప్రాంతాలవారికి వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షల వరకు) మీ సేవ ద్వారా 01.04.2025 తర్వాత పొంది ఉండాలి.

పేద ఎస్సీ విద్యార్థులకు ప్రయోజనం

జిల్లాలోని నిరుపేద ఎస్సీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు 2025–26 విద్యాసంవత్సరానికి గాను జిల్లాలోని కాగజ్‌నగర్‌లోని విశ్వశాంతి హైస్కూల్, కౌటాలలోని మయూరి విద్యాలయాన్ని బెస్ట్ అవైలబుల్ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. వీటిలో ప్రవేశాల కోసం అధికారులు దరఖాస్తులు ఆహ్వానించారు. ఐదో తరగతిలో (రెసిడెన్షియల్) 40 సీట్లు, ఒకటో తరగతిలో (నాన్ రెసిడెన్షియల్) 38 సీట్లు కేటాయించారు. నాలుగో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐదో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

జత చేయాల్సిన పత్రాలివే..

విద్యార్థులు దరఖాస్తు ఫారానికి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా జత చేయాలి. జనన ధ్రువీకరణ పత్రం (మీ సేవా ద్వారా పొందింది), ఆధార్‌కార్డు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటోలు, కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలు (మీ సేవ ద్వారా పొందినవి), తెల్ల రేషన్‌కార్డు, నాలుగో తరగతి మార్కుల జాబితా, బోనఫైడ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా జత చేయాలి.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని నిరుపేద ఎస్సీ విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి. ఈ పథకం కింద ఎంపికైనవారికి ఒకటి నుంచి పదో తరగతి వరకు ఉచితంగా నాణ్యమైన విద్య, వసతులు కల్పిస్తాం. అర్హులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పూర్తి వివరాలకు జిల్లా ఎస్సీ కార్యాలయం లేదా బెస్ట్ అవైలబుల్ పాఠశాలలను సంప్రదించాలి. – యాదగిరి, మయూరి విద్యాలయ కరస్పాండెంట్, కౌటాల

లక్కీ డ్రా ద్వారా ఎంపిక



జిల్లాలోని ఎస్సీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 1, 5 తరగతుల్లో ప్రవేశాలకు ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 16లోపు దరఖాస్తులు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమశాఖ కార్యాలయంలో ఇవ్వాలి. 20న కలెక్టర్ సమక్షంలో లక్కీ డ్రా పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తాం. వివరాలకు 63096 74769 నంబర్‌లో సంప్రదించాలి. – సజీవన్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి

వైద్యకళాశాల విద్యార్థులకు శుద్ధజలం



ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ వైద్య కళాశాలల విద్యార్థులకు శుద్ధజలం అందిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. మంగళవారం అంకుసాపూర్‌లో వైద్యకళాశాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, డీఎంహెచ్‌వో సీతారాంతో కలిసి సందర్శించారు. శుద్ధజల ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఇటీవల పొరుగు సేవల్లో ఎంపికైన 52 మంది ధృవపత్రాలు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, బోధన అందించాలని సూచించారు. కళాశాలలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని భరోసా కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి, ఆస్పత్రి పర్యవేక్షకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బడిబాటను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లాలో ఈ నెల 6నుంచి 19వరకు బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. కలెక్టరేట్ కార్యాలయంలో డీఈవో యాదయ్యతో కలిసి సంబంధిత అధికారులతో సమావేశమై మాట్లాడారు. బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా చూడాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మాస్టర్ మైండ్స్ ద్వారా నిర్వహించనున్న ఆన్‌లైన్ తరగతుల పోస్టర్ ఆవిష్కరించారు. ఎస్వోలు శ్రీనివాస్, మధుకర్, అబిద్ అలీ, డివిజన్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్ తదితరులున్నారు.

క్లుప్తంగా

రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధం



షార్ట్‌సర్క్యూట్‌తో కాలిన ఎలక్ట్రిక్ బైక్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శివాజీచౌక్‌లో ప్రమాదవశాత్తు రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. జిల్లా కేంద్రానికి చెందిన విజయ్‌కేతన్ తన ఎలక్ట్రిక్ స్కూటీని శివాజీచౌక్‌లోని చించరవాడ హనుమాన్ ఆలయం ఎదుట మంగళవారం పార్కింగ్ చేశాడు. ఆ సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో ఎలక్ట్రిక్ బైక్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పక్కనున్న మరో యాక్టీవ బైక్‌కు అంటుకున్నాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పివేసేందుకు యత్నించగా, అప్పటికే రెండు వాహనాలు కాలిబూడిదయ్యాయి. యజమానులు అయోమయానికి గురయ్యారు.

చోరీకి పాల్పడిన నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునిల్ కుమార్ తెలిపారు. కాలనీకి చెందిన గైక్వాడ్ అనిత ఇంట్లో తిర్పెల్లికి చెందిన ఠాకూర్ నర్సింలు చోరీకి పాల్పడ్డాడు. గ్యాస్ సిలిండర్‌తో పాటు రూ.వెయ్యి నగదు అపహరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

క్రీడా పాఠశాలల్లో కోచ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న కబడ్డీ, అథ్లెటిక్స్ కోచ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఐఎస్(ఏడాది డిప్లొమా కోర్సు) శిక్షణ పొందిన అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుకు అన్ని ధ్రువీకరణ పత్రాలు జతపర్చి ఈ నెల 11లోగా డీడీ ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈ నెల 15న సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూ ఉంటుందని, వివరాలకు 9440064422 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

కేసు విచారణలో నిర్లక్ష్యం చేయకూడదు

మంచిర్యాలక్రైం: కేసు విచారణలో విచారణ అధికారి, సిబ్బంది క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం చేయకూడదని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. మంగళవారం డీసీపీ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు పీపీ యం.రమణరెడ్డితో కలిసి జిల్లా పోలీస్ అధికారులతో చట్టాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, కోర్టు డ్యూటీ, లైసన్ అధికారులు పాల్గొన్నారు.

గంజాయి, నకిలీ విత్తనాలపై దృష్టి సారించాలి

మంచిర్యాలక్రైం: జిల్లాలో గంజాయి, నకిలీ విత్తనాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. మంగళవారం స్థానిక డీసీపీ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ జిల్లాలో ఇదివరకు నమోదైన గంజాయి, నకిలీ విత్తనాల కేసులను పరిశీలించి పాత నేరస్తులపై ప్రత్యేక నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు.

పసుపు సాగుకు సమయమిదే..

- జిల్లాలో పెరుగుతున్న సాగువిస్తీర్ణం..
- కొత్త విధానంతో అధిక దిగుబడి



మల్చింగ్ పద్ధతిలో పసుపు పంట సాగు(ఫైల్)



సోన్ మండలం వెల్మల్‌లో పసుపు కొమ్ములు నాటేందుకు సిద్ధం చేస్తున్న రైతులు

మామడ: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పసుపు సాగు విస్తీర్ణం పెరుగుతోంది. పొరుగున్న ఉన్న నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయడం, పసుపునకు మద్దతు ధర లభిస్తుండడంతో ఈ ఏడాది కూడా పసుపు సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే విత్తన పసుపు తెచ్చుకుని విత్తేందుకు సిద్ధం చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలో గత సంవత్సరం 5,542 ఎకరాల్లో పసుపు సాగు చేయగా, ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రుతుపవనాల విస్తరణ, వర్షాలతో రైతులు పసుపు సాగుకు సిద్ధమవుతున్నారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని అధికారులు సూచిస్తున్నారు.

అనుకూల నేల

పసుపు సాగుకు నీరు నిల్వ ఉండని నల్లరేగడి, ఎర్ర చెల్క, ఇసుక నల్లని నేలలు, ఉదజని సూచిక (పీహెచ్) 6 నుంచి 7.5 వరకు, సేంద్రియ పదార్థాలు అధికంగా ఉన్న భూములు అనుకూలం. క్షార గుణం, రాళ్లు ఉన్న నేలలు పసుపు పంటకు సరిపడవు. భూసార పరీక్షల ద్వారా నేల స్వభావాన్ని తెలుసుకోవాలని సూచిస్తున్నారు.

విత్తన ఎంపికలో జాగ్రత్తలు

పసుపు సాగులో విత్తన ఎంపిక కీలకం. ప్రతీ మూడేళ్లకు విత్తన మార్పిడి చేయడం వల్ల తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుంది. జిల్లాలో దీర్ఘకాలిక రకాలైన దుగ్గిరాల ఎరుపు, ఆర్మూర్, సేలం రకాలను రైతులు సాగు చేస్తున్నారు. తల్లి (మండ) దుంపలు విత్తనాలుగా వాడితే పిల్ల (కొమ్ము) దుంపల కంటే అధిక దిగుబడి లభిస్తుంది. ఎకరానికి తల్లి దుంపలు 8 క్వింటాళ్లు, పిల్ల దుంపలు 5 క్వింటాళ్లు అవసరం. విత్తనాలను కనీసం రెండు కణుపులతో కత్తిరించి వాడితే విత్తనం ఆదా అవుతుంది. పంట మార్పిడి పాటించడం ద్వారా మినుము, పెసర, సోయా, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేయడం లాభదాయకం.

విత్తన శుద్ధి పద్ధతులు

పసుపు విత్తనాలను నాటే ముందు లీటరు నీటికి 3 గ్రాముల రిడోమిల్ ఎంజడ్, 2 ఎంఎల్ డైమిథోయేట్ కలిపి ద్రావణం తయారు చేసి, 45 నిమిషాలు విత్తన కొమ్ములను నానబెట్టి శుద్ధి చేయాలి. అనంతరం ట్రైకోడెర్మా విరిడే శిలీంధ్ర నాశినితో శుద్ధి చేసి నాటాలి. నాటడానికి 2–4 వారాల ముందు 1 కిలో ట్రైకో ప్రైమ్ పొడిని 10 లీటర్ల నీటిలో కలిపి 25 కిలోల విత్తనాలను శుద్ధి చేయాలి. దుక్కిలో ఎకరానికి 200 కిలోల వేపపిండి, 50 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, పశువుల పేడ వాడాలి. 40 రోజుల తర్వాత 200 కిలోల వేపపిండి, 50 కిలోల యూరియా, 80 రోజుల తర్వాత 50 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్, నాలుగు నెలల తర్వాత 50 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ వాడి మెళుకువలు పాటిస్తే మంచి దిగుబడి సాధ్యం.

మల్చింగ్ పద్ధతితో..

బెడ్, మల్చింగ్ పద్ధతులతో పసుపు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. బెడ్ కొలతలు 110 సెం.మీ. వెడల్పు, 20 సెం.మీ. ఎత్తు, 30 సెం.మీ. దూరంతో ఉండాలి. ఈ పద్ధతి ద్వారా దుంపకుళ్లు తగ్గి, 20% అధిక దిగుబడి లభిస్తుంది. ఎకరానికి 35 వేల పసుపు మొక్కలు వచ్చేలా చూసుకోవాలి. పొడవైన మడులు తయారు చేసి, 30 ఎంఎం ప్లాస్టిక్ కవర్‌తో కప్పాలి. బిందు సేద్యం ద్వారా నీరు, పోషకాలు అందించాలి. మల్చింగ్ వల్ల కలుపు మొక్కలు తగ్గి, రసాయనాల వాడకం, కూలీల ఖర్చు తగ్గుతుంది.

బెడ్ పద్ధతిలో సాగు చేస్తున్నా..



నేను ఐదెకరాల్లో పసుపు పంటను సాగు చేస్తున్నాను. పసుపు విత్తనం నాటే ముందు విత్తన శుద్ధి చేయడం ద్వారా దుంపకుళ్లు వంటి తెగులు రాకుండా ఉంటుంది. పసుపు బెడ్ పద్ధతిలో సాగు చేయడం ద్వారా దిగుబడి ఎక్కువగా వచ్చింది. – చిన్నారెడ్డి, రైతు, కొరటికల్

మల్చింగ్ పద్ధతిలో..



పసుపు సాగులో రైతులు జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. విత్తన ఎంపిక, విత్తన శుద్ధి, ఎరువులు, సూక్ష్మపోషకాలు అందించడంలో మెలకువలు పాటించాలి. మల్చింగ్ పద్ధతిలో పసుపు పంటను సాగు చేయడం ద్వారా రైతులు కలుపు మొక్కలను సులభంగా నివారించవచ్చు. పెట్టుబడి ఆదా చేసుకుని అధిక దిగుబడులు సాధించవచ్చు. – మౌనిక, ఉద్యానశాఖ అధికారి, నిర్మల్ డివిజన్

'పోడు' భూములను లాక్కోవద్దు



వినతిపత్రం పంపుతున్న గ్రామస్తులు

ఇచ్చోడ: మండలంలోని కేశవపట్నం అటవీ పరిధిలో పోడు భూముల్లో ఏళ్లుగా సాగు చేస్తుకుంటున్న తమను అటవీ అధికారులు అడ్డుకోవడం సరికాదని పలువురు రైతులు పేర్కొన్నారు. ఈమేరకు జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాంకు మంగళవారం ఫ్యాక్స్‌ద్వారా వినతిపత్రం పంపినట్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో అటవీ శాఖ అధికారులు ప్రస్తుతం మొక్కలు నాటుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

మామడ: మండలంలోని పరిమండల్ గ్రామానికి చెందిన ఎర్రం సతీశ్ బైండోవర్ ఉల్లంగించినందుకు మంగళవారం రూ.40 వేల జరిమానా విధించినట్లు నిర్మల్ ఎక్సైజ్ సీఐ రంగస్వామి తెలిపారు. గతంలో నల్ల బెల్లం, పటిక విక్రయిస్తూ పట్టుబడగా కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ ఉల్లంఘించి మళ్లీ నల్ల బెల్లం, పటిక విక్రయిస్తూ పట్టుబడటంతో కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరు పర్చారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రావు రూ.40 వేల జరిమానా విధించారు. నిర్మల్ ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్, సిబ్బంది ఇర్ఫాన్, వెంకటేశ్, హరీశ్ పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొట్టిన లారీ

- ముగ్గురికి గాయాలు





గాయపడిన పాల్సీరాం, గుగ్లోత్ శశికాంత్



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై శ్రీకాంత్

సారంగపూర్: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం డ్యాంగాపూర్ గ్రామ శివారు ప్రాంతంలో కల్వర్టు వద్ద మంగళవారం స్కూటీని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన గుగ్లోత్ శశికాంత్, ఆయన తండ్రి పాల్సీరాం, తల్లి శవంతాబాయి గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుగ్లోత్ శశికాంత్ తన స్కూటీపై తల్లిదండ్రులను ఎక్కించుకుని ఆదిలాబాద్ వైపు వెళ్తున్నాడు. ఇదేసమయంలో ఎదురుగా నిర్మల్ వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ తిరుపతి లారీని అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ స్కూటీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో స్కూటీపై వెళ్తున్న ముగ్గురు ఎగిరి కిందపడ్డారు. తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు లారీడ్రైవర్ తిరుపతిపై కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



కుడ్మేత దత్తు (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: గత నెల 29న మావల పరిధిలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కుడ్మేత దత్తు (23) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సీఐ కర్రె స్వామి తెలిపిన ప్రకారం వివరాలు.. మావల మండలంలోని వాఘపూర్ గ్రామానికి చెందిన దత్తు ఆటో ట్రాలీతో భోరజ్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మావల శివారులో రోడ్డుకు పక్కన వాహనాన్ని నిలిపి ఆటోపై ఉన్న పరద సరి చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు అతడిని వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో దత్తుకు తీవ్ర గాయాలవగా వెంటనే స్థానికులు రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు అదే రోజు హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయనను కుటుంబసభ్యులు సోమవారం మళ్లీ రిమ్స్‌కు తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ మంగళవారం వేకువజామున మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

కాలువలో పడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

లక్ష్మణచాంద: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామంలో బహిర్భూమికి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే వడ్యాల్ గ్రామానికి చెందిన రావులబండి ముత్తన్న(51) మంగళవారం సాయంత్రం గ్రామ సమీపంలోని సరస్వతీ కాలువవైపు కాలకృత్యాల కోసం వెళ్లాడు. ఆకస్మాత్తుగా కాలువలోకి జారిపడిపోయాడు. అటువైపుగా వెళ్లిన స్థానికులు సరస్వతీ కాలువలో మృతదేహం చూసి పోలీసులకు సమాచారం అందించారు. సోన్ సీఐ గోవర్ధన్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట మామడ ఎస్సై అశోక్, ఏఎస్సై నారాయణరెడ్డి ఉన్నారు.

నీటిగుంతలో పడి బాలుడు మృతి



మృతుడు షల్కె సాయినాథ్

కుభీర్: నిర్మల్ జిల్లా కుభీర్ మండలం హల్దా గ్రామంలో మంగళవారం సాయంత్రం ఓ బాలుడు గుంతలో పడి మృతిచెందాడు. గ్రామానికి చెందిన షల్కె సాయినాథ్(09) బహిర్భూమికి వెళ్లాడు. తర్వాత చెరువులోని నీటి గుంత వద్దకు వెళ్లాడు. అదుపు తప్పి గుంతలో పడ్డాడు. మొరం కోసం తవ్విన గుంత కావడం, ఇటీవల కురిసిన వర్షాలకు గుంత నిండడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతితో తల్లిదండ్రుల గుండెలు పగిలేలా రోధిస్తున్నారు. తండ్రి అనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

తాండూర్: మండలంలోని రేపల్లెవాడ శివారు జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి వైపు నుంచి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ వేగంగా ఢీకొట్టడంతో ట్రాక్టర్ డ్రైవర్ భుక్య రాజేష్(37) అక్కడికక్కడే మృతిచెందాడు. పక్కన కూర్చున్న రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు సోమగూడెం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం శివారులో పేకాట స్థావరాలపై మంగళవారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై నరేశ్ తెలిపా రు. విశ్వసనీయ సమాచారం మేరకు గూడెం సమీపంలో నిర్వహించిన దాడుల్లో ఇదే గ్రా మానికి చెందిన అభిజిత్ ముజుందార్, కార్ ప్రకాశ్, మల్లేశ్, రాకేశ్ పేకాడుతూ పట్టుబడినట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.2,140 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

బావిలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

బెజ్జూర్: గుర్తు తెలియని వ్యక్తి బావిలో పడి మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలోని బారెగూడ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. మృతుడి వయస్సు 70 ఏళ్లు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఘటనా స్థలానికి బెజ్జూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ చేరుకుని వివరాలు సేకరించారు.

అంతర్జాతీయ సదస్సులో ఆర్జీయూకేటీ విద్యార్థులు

- హైదరాబాద్ ఐఐటీలో స్పిక్ మెకే పదో అంతర్జాతీయ సమ్మేళనం
- వారం రోజులపాటు సాంస్కృతిక ఉత్సవం



సమ్మేళనంలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు

బాసర: ఐఐటీ హైదరాబాద్‌లో స్పిక్ మెకే 10వ అంతర్జాతీయ సమ్మేళనం వారం రోజులపాటు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సమ్మేళనంలో నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జీయూకేటీ) నుంచి 35 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ సాంస్కృతిక చైతన్యం, దేశీయ కళలపై గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని తెలిపారు. ఈ అవకాశం వారి వ్యక్తిత్వ వికాసానికి ఒక గొప్ప వేదికగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

వాలంటీర్లుగా సేవలు

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులకు సహాయం అందించడంలో ఆర్జీయూకేటీ విద్యార్థులు వాలంటీర్లుగా చురుగ్గా పాల్గొన్నారు. వారు తమ సేవల ద్వారా అందరి మన్ననలు పొందారు. అంతేకాకుండా, మీడియా విభాగంలో చేరి స్పిక్ మెకే సమ్మేళనంపై విస్తృతంగా ప్రచారం చేయడంలో కీలకపాత్ర పోషించారు.

కళల వర్క్‌షాప్‌లలో..

సమ్మేళనంలో భాగంగా నిర్వహించిన వర్క్‌షాప్‌లలో విద్యార్థులు కథక్, కూచిపూడి, భరతనాట్యం, కర్ణాటక సంగీతం, గోండు పెయింటింగ్ వంటి సంప్రదాయ కళలను నేర్చుకున్నారు. ఈ వర్క్‌షాప్‌లు విద్యార్థులకు కళల పట్ల లోతైన అవగాహన, నైపుణ్యాన్ని అందించాయి.

కళాకారులతో సమావేశం..

స్పిక్ మెకే సమ్మేళనం భారతీయ కళలను ప్రపంచానికి పరిచయం చేయడంతోపాటు, విద్యార్థులకు ప్రముఖ కళాకారులను కలిసే అవకాశాన్ని కల్పించింది. ఈ అనుభవాలు తమ జీవితంలో ఎంతో స్ఫూర్తినిస్తాయని, కళల పట్ల అభిరుచిని మరింత పెంపొందించాయని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. వారు విద్యార్థులకు మార్గదర్శనం చేస్తూ, కార్యక్రమ విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమం ద్వారా వారు నేర్చుకున్న కళలు, పొందిన అనుభవాలు వారి వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో ఎంతో ఉపయోగపడతాయని ప్రొఫెసర్ గోవర్ధన్ అభిప్రాయపడ్డారు. ఈ సమ్మేళనంలో ఆర్జీయూకేటీ నుంచి అధ్యాపకులు డాక్టర్ శ్రవణ్, డాక్టర్ రాకేశ్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు శివ బాలాజీ, వంశీకృష్ణ, రచన, మణికంఠ పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదు పెంచాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- 'బడిబాట'పై అధికారులతో సమీక్ష



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీవో ఖుష్బూగుప్తా

ఉట్నూర్‌రూరల్: వందశాతం గిరిజన విద్యార్థుల నమోదు లక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సూచించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని డీడీలు, డీటీడీవోలు, ఏటీడీవో, పీఎంఆర్సీ సిబ్బందితో ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రాథమిక, ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల పరిధిలోని గిరిజన గ్రామాల్లో సభలు నిర్వహించి విద్యార్థులను బడిలో చేర్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ గిరిజన గ్రామానికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని, డివిజన్ల వారీగా ఏటీడీవోల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చే యాలన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని సీబాపు కాలనీ సమీపంలో మంగళవారం సాయంత్రం కాగజ్‌నగర్ పట్టణంలోని ఇందిరా మార్కెట్‌కు చెందిన సయ్యద్ దావుద్(18)దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు బండరాయితో కొట్టి హత్య చేసినట్లు తెలుస్తోంది. ఐదుగురు వ్యక్తులు గంజాయి సేవించి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. యువకుడి హత్యకు ప్రేమ వ్యవహారం లేదా గంజాయి మత్తులో ఎవరైనా ఈ దారుణానికి పాల్పడ్డారా? అనే కోణంలో స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇటీవల గంజాయి సేవించి వచ్చే వ్యక్తులు తరచుగా కనబడుతున్నట్లు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై సందీప్‌కుమార్‌ను సంప్రదించగా వారు అందుబాటులోకి రాలేదు. హత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

హత్యకు దారితీసిన పాత పరిచయం

- సహజీవనం చేస్తున్న మహిళతో కలిసి చోరీ, హత్య
- ఏడు నెలల తర్వాత వీడిన మిస్టరీ
- వివరాలు వెల్లడించిన మంచిర్యాల డీసీపీ భాస్కర్



వివరాలు వెల్లడించిన డీసీపీ ఎగ్గడి భాస్కర్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో సంచలనం రేపిన మహిళ హత్య మిస్టరీని ఎట్టకేలకు ఏడు నెలల తర్వాత పోలీసులు ఛేదించారు. హత్యకు పాల్పడిన ఇద్దరిని పోలీసులు స్థానిక రైల్వేస్టేషన్‌లో అరెస్టు చేశారు. మంగళవారం మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో డీసీపీ ఎగ్గడి భాస్కర్ వివరాలు వెల్లడించారు. లక్సెట్టిపేట మండలం జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన కూస లక్ష్మి(55) భర్తను వదిలి మంచిర్యాలలోని గణేష్‌నగర్‌లో ఒంటరిగా ఉంటూ కూరగాయలు, బియ్యం వ్యాపారం చేసేది. ఈ క్రమంలో కాలేజీరోడ్‌లో నివాసం ఉండే పెద్దపల్లి జిల్లా స్తంభంపల్లికి చెందిన మండలి నరేష్‌తో పరిచయం ఏర్పడింది. కొంతకాలం తర్వాత హైదరాబాద్‌లోని సుచిత్ర ప్రాంతంలో కుటుంబంతో నివాసం ఉంటూ బార్బర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగించేవాడు. నరేష్ కుమారుడికి ఆరోగ్యం బాగాలేక అక్కడే ఆస్పత్రికి తీసుకెళ్లగా నర్సు అతినారపు అలివేలుతో పరిచయం పెంచుకుని సహజీవనం చేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడి అప్పుల పాలయ్యాడు. అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి తెచ్చారు. సులువుగా డబ్బు సంపాదనకు దొంగతనం చేయాలని నరేష్ చెప్పగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అలివేలు సైతం అంగీకరించింది. మంచిర్యాలలోని లక్ష్మికి భర్త లేడని, డబ్బులు, బంగారం ఉన్నాయని, ఒంటరిగా ఉంటోందని చెప్పి చోరీకి పథకం వేశారు. గత ఏడాది నవంబర్ 26న మంచిర్యాలకు వచ్చి చోరీకి యత్నించి విఫలమయ్యారు. మరునాడు 27న సాయంత్రం 7గంటల ప్రాంతంలో లక్ష్మి ఇంటికి వచ్చిన నరేష్, అలివేలు ఆమె గొంతు నులిమి హత్య చేశారు. ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్ దోచుకుని ఇంటికి తాళం వేసి పారిపోయారు. అదే నెల 30 ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని ఏడు నెలల తర్వాత చిక్కుముడి విప్పారు. నిందితుల నుంచి రెండు తులాల బంగారు నగలు, 20తులాల వెండి పట్టగొలుసులు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడు రికవరీ చేయాల్సి ఉందని డీసీపీ వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మిస్టరీని ఛేదించిన సీఐ ప్రమోద్‌రావు, సీసీఎస్ ఎస్సై మధుసూదన్‌రావు, ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, తిరుపతి, కిరణ్‌కుమార్, సిబ్బంది మహేష్‌బాబు, రాము, సురేష్, జాఫర్, సతీష్‌లను సీపీ అంబర్ కిశోర్ ఝా, డీసీపీ భాస్కర్ అభినందించడంతోపాటు రివార్డు అందజేశారు.

మంచిర్యాలలో వార్డుల పునర్విభజన

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్‌లో వార్డుల పునర్విభజనకు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అర్వింద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 4న వార్డుల విభజనపై ప్రజల నుంచి సూచనలు స్వీకరణ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీలకు లేఖ, 5నుంచి 11వరకు సలహాలు స్వీకరణ, 17, 18న కలెక్టర్ అనుమతి, 19న కమిషనర్, డైరెక్టర్‌కు నివేదిక, 20న ప్రభుత్వానికి నివేదిక అందించి 21న నోటిఫికేషన్ విడుదల చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం 36వార్డులు ఉండగా 60వార్డులుగా విభజించాలని ఉత్తర్వుల్లో ప్రతిపాదించారు.

భార్య మృతికి కారకుడైన భర్త రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ కాలనీకి చెందిన ప్రవళిక మృతికి కారకుడైన ఆమె భర్త ప్రశాంత్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, మరో కాన్పు ఇష్టం లేని భర్త శ్రీనివాస్ భార్యకు గర్భం దాల్చకుండా మాత్రలు వేశాడు. దీంతో ఆమెకు తీవ్ర రక్త స్రావం జరిగింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందగా భర్త పరారీలో ఉన్నాడు. ఈమేరకు మంగళవారం అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.